www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 20 ఫిబ్రవరి 2023
5
చిత్తూరు




హెల్ప్ డెస్క్, కాల్ సెంటర్ ఏర్పాటు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాల ఉపాధ్యాయుల, పట్టభద్రుల మరియు స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలు 2023కు సంబంధించి అభ్యర్థులు, ఓటర్లు తమ సందేహాల నివత్తికి లేదా సమస్యలను ఫిర్యాదు చేయుటకు గానూ ఎన్నికల హెల్ప్‌డెస్క్, కాల్‌సెంటర్‌కు సంప్రదించవచ్చు అని జిల్లా కలెక్టర్ మరియు ఎన్నికల రిటర్నింగ్ అధికారి యం. హరి నారాయణన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులు, ఓటర్లు తమ సందేహాలు, ఫిర్యాదు నమోదు కొరకు ఈ హెల్ప్‌డెస్క్‌కు కాల్ సెంటర్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 24/7 హెల్ప్‌డెస్క్ నెం.08572-242777, కాల్ సెంటర్ నెం.1950లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అభ్యర్థులు, ఓటర్లు తమ సందేహాల నివత్తికి ఫిర్యాదు నమోదు కొరకు ఈ హెల్ప్‌డెస్క్‌కు కాల్ సెంటర్‌లకు ఫోన్ చేయవచ్చునని తెలిపారు.

ప్రశాంతంగా
ఎస్‌ఐ ప్రాథమిక రాత పరీక్ష

ప్రజాశక్తి- తిరుపతి సిటి : ఎస్‌ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్షల్లో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు ఎస్‌పి పరమేశ్వర్‌రెడ్డి వెల్లడించారు. బస్ స్టాండ్, రైల్వే స్టేషన్ ల వద్ద హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేసి అభ్యర్థుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి ఏలాంటి ఆసౌకర్యం కలగకుండా ఉచిత బస్సులను ఎర్పాటు చేసి పరీక్షా కేంద్రాలకు చేరవేశారు. తిరుపతిలో మొత్తం 21 రాత పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసారు. 12,799 అభ్యర్థులకు గాను 10,893 మంది హాజరయ్యారు. ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల, సీకాం డిగ్రీ కళాశాలల్లో జరుగుతున్న ఎస్‌ఐ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలను ఎస్‌ఐ పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలయ్యింది. ఈ కార్యక్రమంలో ఎగ్జామ్ నోడల్ ఆఫీసర్ పి.జగదీశ్, అడిషనల్ యస్.పి అడ్మిన్ వెంకట్రావ్, ఈస్ట్ డియస్‌పి నరసప్ప, యస్.వి.యు సి.ఐ రావీంద్ర నాథ్, పాకాల సి.ఐ రాజ్ శేఖర్ పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

రానున్న వేసవి దృష్ట్యా...
తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

వ్యవసాయ బోర్లతో 'టైఅప్ అండ్ ట్రాన్స్‌పోర్టు'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

రానున్న వేసవిని దృష్ట్యా ఉమ్మడి చిత్తూరుజిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన అన్నిచర్యలు చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు ఎక్సైజ్ శాఖమాత్యులు కె.నారాయణస్వామి, రాష్ట్ర అటవీ విద్యుత్ పర్యావరణ శాస్త్రసాంకేతిక భూగర్భగనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి జిల్లా ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జెడ్‌పిలోని సమావేశ మందిరంలో జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. సభ ప్రారంభం కాగానే తొలుతగా చిత్తూరు జిల్లాకు చెందిన మాజీమంత్రి గుమ్మడి కుతూహలమ్మ మతికి మంత్రి జెడ్‌పి చైర్మన్, ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులు, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ సురేష్, నగర మేయర్ అముద, జెడ్‌పి వైస్‌చైర్మన్‌లు ధనుంజయరెడ్డి, రమ్యలు, జెడ్‌పిసిఈఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధికారులు, జడ్పిటిసి, ఎంపీపీ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. అనంతరం సాధారణ సర్వసభ్య సమావేశంలో భాగంగా మంత్రులు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రానున్న వేసవిలో ప్రజలకు తాగునీటికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి వ్యవసాయ బోర్లతో టై అప్ అండ్ ట్రాన్స్పోర్ట్ ద్వారా ట్యాంకర్‌లతో నీటి సరఫరాకు ఏర్పాట్లు చేయాలన్నారు. మండల స్థాయిలోని అధికారులు గ్రామాల పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎక్కడా సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



జెడ్‌పి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

నేడు ఏక సభ్య కమిషన్ జిల్లా పర్యటన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

కుప్పం, గుడుపల్లి మండలాలలో వాల్మీకి, బోయల సామాజిక, ఆర్థిక స్థితిగతులను తెలుసుకొనుటకు సోమవారం (వన్‌మాన్ కమిషన్) ఏక సభ్య కమిషన్ శామ్యూవేలు ఆనంద కుమార్ పర్యటిస్తారని జిల్లా గిరిజన సంక్షేమ మరియు సాధికారత అధికారి ఏ.మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం బెంగుళూరు నుంచి కుప్పం మండలం, ఉరినాయనపల్లి గ్రామం, గుడుపల్లి మండలం, సోడిగానిపాళ్యం గ్రామాల్లో వాల్మీకి, బోయల సామాజిక, వారి ఆర్థికస్థితిగతులపై అనంతపురం జిల్లా కేంద్రీయ విశ్వవిద్యాలయం బోధన సిబ్బంది, విద్యార్థులు నిర్వహించే సర్వే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అన్నమయ్య జిల్లా మదనపల్లికు చేరుకొని రాత్రి బసవ చేస్తారు. 21న మంగళవారం ఉదయం మదనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో అన్నమయ్య జిల్లాకు సంబంధించిన వాల్మీకి,బోయలతో పబ్లిక్ సమావేశం నిర్వహిస్తారు. అనంతరం మదనపల్లి నుండి బయలుదేరి చిత్తూరు చేరుకొని సాయంత్రం నాలుగు గంటలకు చిత్తూరు జిల్లాకు సంబంధించిన వాల్మీకి, బోయలతో జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్‌లో పబ్లిక్ సమావేశం నిర్వహించి తర్వాత తిరుపతికి బయలుదేరి వెళ్లతారని తెలిపారు.

వేడుకగా 'శివరాత్రి' రథోత్సవం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తిలో ఆదివారం రథోత్సవం జరిగింది. స్వామి రథంతో పాటు అమ్మవారి రథమూ భక్తులకు కనువిందు చేసింది. వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామీ, అమ్మవార్లకు ఉదయం అభిషేకాలు పూర్తయిన తర్వాత ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా ఆలయం వెలుపలకు తీసుకువచ్చి రథంపై అలంకరించారు. తొలుత గంగాదేవి సమేతుడైన సోమస్కందమూర్తి రథాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత జ్ఞానప్రమానాంబ రథానికి పూజలు నిర్వహించి ప్రారంభించారు. భూమిని రథంగా, సూర్య చంద్రులు చక్రాలుగా వేదా లు, పురాణాలు గుర్రాలుగా, సష్టికర్త బ్రహ్మ సారథ్యంలో సాగేదే రథోత్సవం. సుమారు మూడు గంటలకుపైగా రథోత్సవం కొనసాగింది. హర హర మహదేవా శంభో శంకరా అంటూ భక్తులు పారవశ్యంతో రథోత్సవంలో పాల్గొన్నారు. ముందుగా స్వామివారి రథాన్ని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు భక్తులతో కలిసి తేరు వీధి, నెహ్రూ వీధుల మీదుగా పెండ్లి మండపం వద్దకు చేర్చారు. ఆ తర్వాత అమ్మవారి రథాన్ని తీసుకెళ్లారు. భక్తులు ఉప్పు, మిరియాలను రథాలపై చల్లి మొక్కులు తీర్చుకున్నారు. రథం పై నుంచి పడిన మిరియాలను తీసుకునేందుకు భక్తులు పోటీపడ్డారు.

నేత్ర పర్వంగా తెప్పోత్సవం


మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగాఆదివారం రాత్రి నారద పుష్కరిణిలో తెప్పోత్సవం కన్నుల పండువగా సాగింది. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజును బ్రహ్మరాత్రి అంటారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు రథోత్సవం జరిగింది. రాత్రి తెప్పోత్సవం నిర్వహించారు. ఆభరణాలతో, పూలతో అలంకరించిన స్వామి, అమ్మవార్ల ఉత్స వమూర్తులను ఆలయం నుంచి ఊరే గింపుగా కోనేరు వద్దకు తీసుకొచ్చారు. పుష్కరిణిలో ఉత్సవ మూర్తులను ఐదుసార్లు ప్రదక్షిణ చేయించారు.

మనసైన 'మనశైల'

శైలకుమార్ సన్మాన సభలో వక్తలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ప్రముఖ రచయిత శైలకుమార్ రచించిన 'మనశైల' పుస్తకం అందరి మనస్సుల్లో ఉండిపోతుందని వక్తలు ప్రశంసించారు. ఎంఎల్‌ఎ భూమన కరుణాకర్‌రెడ్డి, శైలకుమార్ స్నేహం చిరస్థాయిగా నిలిచిపోతుందని ప్రముఖ సినీ రచయిత భువనచంద్ర కొనియాడారు. ఆదివారం తిరుపతిలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాలులో ప్రముఖ రచయిత శైలకుమార్ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సభాధ్యక్షులుగా హాజరైన రిటైర్డ్ ప్రొఫెసర్ భూమన్ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులను పరిచయం చేస్తూ సభకు వన్నె తీసుకొచ్చేలా తన వాక్చాతుర్యంతో అందరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా శైలకుమార్‌పై రాసిన 'మనశైల' పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలుగు అకాడమి చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి హాజరై 'మనశైల' పుస్తకంలోని ఆణిముత్య రచనలను, సారాంశాన్ని సభకు తెలిపారు. కవి సాకం నాగరాజు మాట్లాడుతూ ఎవరెస్టు అంత ఎత్తు ఎదిగిన బహుముఖ శాలి శైలకుమార్ అని కొనియాడారు. ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి 1970వ శతకంలో విద్యార్థి దశ నుండి తమ అన్న భూమాన్ ఉద్యమ స్ఫూర్తిలో పాల్గొంటూ ఎదిగిన జీవితాన్ని గుర్తు చేసుకున్నారు. ఆనాడు తనతో పాటు శైల కుమార్ ప్రముఖ నేతలు జైల్లో గడిపిన సందర్భాలను సభలో నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ డాక్టర్ శిరీష, వైసీపీ శ్రేణులు, కవులు, రచయితలు, మేధావులు, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శైలకుమార్‌ను సన్మానిస్తున్న తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, పలువురు ప్రముఖులు

రేపటి నుంచి లోకేష్ పాదయాత్ర పునఃప్రారంభం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

నందమూరి తారక రత్న మతితో వాయిదా పడ్డ నారా లోకేష్ యువగళం పాదయాత్ర మంగళవారం నుంచి తిరిగి ప్రారంభం కానుంది. శివరాత్రి రోజు విరామం అనంతరం 23వ రోజు యువగళం పాదయాత్ర ఆదివారం ప్రారంభం కావాల్సిన నేపథ్యంలో తారక రత్న మతితో వాయిదా పడింది. ఆదివారం తెల్లవారు జామున లోకేష్ తారక్ రత్న మతదేహాన్ని కడసారి చూసేందుకు హైదరాబాద్ కు వెళ్లారు. అక్కడ మహా ప్రస్థానంలో తారక రత్న అంత్యక్రియలు పూర్తయిన వెంటనే సోమవారం రాత్రి శ్రీకాళహస్తికి చేరుకుంటారు. మంగళవారం యధావిధిగా యాత్ర కొనసాగుతుంది.

పాదయాత్ర షెడ్యూల్

శ్రీకాళహస్తిలోని విడిది కేంద్రం నుండి ఉదయం 8 గంటలకు పాదయాత్ర ప్రారంభమవుతుంది. 8.20 గంటలకు మిట్టకండ్రిగలో స్థానికులతో మాటామంతి. 10 గంటలకు తొండమనాడులో స్థానికులతో మాటామంతిలో పాల్గొంటారు. 10.15 గంటలకు తొండమానుపురం దిగువ వీధిలో 300 కి.మీ పూర్తి అయిన సందర్భంగా శిలాఫలకం ఆవిష్కరిస్తారు. 10:20 గంటలకు తొండమానుపురం దిగువ వీధిలో మహిళలతో ముఖాముఖిలో పాల్గొంటారు. 11.10 గంటలకు సుబ్బానాయుడు కండ్రికలో స్థానికులతో మాటామంతి నిర్వహిస్తారు. మధ్యాహ్నం12.30 గంటలకు వెంకటాపురంలో భోజన విరామం. రెండు గంటలకు బండారుపల్లిలో స్థానికులతో మాటామంతి నిర్వహిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు కోబాకలో వన్నెకుల క్షత్రియులతో సమావేశం నిర్వహిస్తారు. 5.30 గంటలకు కోబాక విడిది కేంద్రంలో రాత్రి బస చేస్తారు.

వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్గా రెడ్డి వారి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

స్థానిక లక్ష్మీపురం కూడలిలోని హెూటల్ చక్రి రెసిడెన్సీలో ఆదివారం వాకర్స్ ఇంటర్నేషనల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు సుంకర రవీంద్ర, ముఖ్యఅతిథిగా ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రవి రాజు, వాకర్ ఇంటర్నేషనల్302 జిల్లా గవర్నర్ ఆర్కాట్ కష్ణ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సమావేశంలో 302 జిల్లావాకర్స్ ఇంటర్నేషనల్ నూతన గవర్నర్ గా తిరుమల తిరుపతి దేవస్థానం విశ్రాంత స్పెషల్ గ్రేడుడిప్యూటీ ఈవో, ప్రస్తుత గోవిందరాజ వాకర్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డి వారి ప్రభాకర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే వీరితోపాటు నూతనంగా ఏర్పాటైన టీం ప్రమాణ స్వీకారం చేసింది. వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు సుంకర రవీంద్ర వాకర్స్ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ, వాకర్స్ ఇంటర్నేషనల్, భారతదేశం ఆంధ్రప్రదేశ్లో పుట్టిన సేవా సంస్థ అని పేర్కొన్నారు.అలాగే నూతనంగా ఎన్నికైన గవర్నరు, నూతన టీం కలసి ఐదు రాష్ట్రాలలో (రాయలసీమ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి) అనేక నూతన వాకర్స్ క్లబ్బులను ఏర్పాటు చేయాలని తెలియజేశారు. కార్యక్రమ ముఖ్య అతిథి ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రవి రాజు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని, అందులోకి అందరూ ప్రతిరోజు నడక అలవాటు చేసుకోవాలని, ప్రతినెల వాకర్స్ క్లబ్బులు వాకర్ సభ్యులకు బిపి షుగర్ టెస్ట్ నిర్వహించాలని తెలియజేస్తూ, వాకర్స్ సభ్యులకు నడక పైన, ఆరోగ్యం పైన అవగాహన పెంపొందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ నాయకులు కోనేటి రవిరాజు, గోపిప్రసాద్ ,డాక్టర్ విఎస్ఆర్ ఆంజనేయులు, మాయాబజార్ భాస్కర్ రెడ్డి, డిఎస్‌పి పంతుల శంకర్, బండి మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.



షార్ కాంట్రాక్టు డ్రైవర్లకు 'పే'స్లిప్పులివ్వాలి

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

'షార్' కాంట్రాక్టు డ్రైవర్లకు వేతనాలకు సంబంధించిన 'పే'స్లిప్పులు ఇవ్వాలని సిఐటియు మండల అధ్యక్షులు ఎస్.సాంబశివయ్య, కార్యదర్శి సిహెచ్ సుధాకర్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం సూళ్లూరుపేట కార్మిక సమాఖ్య (సిఐటియు) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా షార్ కాంట్రాక్టు డ్రైవర్ల సమస్యలపై చర్చించారు. వంశీ కాంట్రాక్టర్ వేతనాలను సకాలంలో ఇవ్వడం లేదని, పిఎఫ్ నెలల తరబడి జమ చేయడం లేదని, బిల్లులు ఎలా చెల్లిస్తున్నారో తెలియడం లేదని, పెంచిన డిఎ బకాయిలు, బోనస్, ఒటి అరియర్స్ ఇవ్వడం లేదన్నారు. వివరాలతో కూడిన వేతన పట్టీ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఇఎస్ఐ కట్ అవుతున్నా వైద్య సౌకర్యం కల్పించడం లేదన్నారు. ఈ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళతామని, కార్మికులందరూ కలసికట్టుగా ఉండాలన్నారు.



పిసిసి అధ్యక్షులు గిడుగుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రేణిగుంట విమానాశ్రయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుకు ఆ పార్టీ నాయకులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలో రెండు రోజులపాటు పిసిసి అధ్యక్షులు పర్యటిస్తారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం చైర్మన్ గౌడ పేరు చిట్టిబాబు, పిసిసి ప్రధాన కార్యదర్శి దొడ్డారెడ్డి రాంభూపాల్ రెడ్డి, కార్యదర్శి యార్లపల్లి గోపి, అఖిలభారత బిసి సెల్ కోఆర్డినేటర్ కె.మురళీకష్ణ, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, చిత్తూరు శివశంకర్, రేణిగుంట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావణ, సీనియర్ నాయకులు చిరంజీవి పాల్గొన్నారు.



నేడు యూనివర్సిటీ కాంట్రాక్టు కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - క్యాంపస్

ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీలో 22 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 20న సోమవారం రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఆల్ యూనివర్సిటీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి గంఇకోట నాగవెంకటేష్ పిలుపునిచ్చారు. తిరుపతి కాలేజీ, ఎఆర్ఎస్, ఆర్ఎఆర్ఎస్ సెంటర్లో పనిచేస్తున్న కార్మికులతో జనరల్‌బాడీ సమావేశం ఆదివారం జరిగింది. సిఐటియు జిల్లా నాయకులు జయచంద్ర, వెటర్నరీ యూనివర్సిటీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిన్నబాబు ఈ సమావేశానికి హాజరయ్యారు. కనీస వేతనాలు అమలు చేయాలని, టైంస్కేల్, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలనాన్రు. ప్రమాదబీమా ఐదు లక్షల రూపాయలు, ప్రసూతి సెలవులు, ప్రభుత్వ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వరలక్ష్మి, చంద్రమ్మ, రాకేష్, రవి, మదన్, రేవతి, రమాదేవి, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, మునిలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజలకు అండగా... ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం..!

'అమ్మ'పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు సుబ్రవేణి

ఇంటర్వ్యూ



ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఏకపక్ష నిర్ణయాలతో ప్రజలకు తాయిలాలు ఎరచూపి అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వాన్ని నిలదీసి, సామాన్య, పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలబడి, వారి అభివృద్ధికి కృషి చేసేందుకు 'అమ్మ' పార్టీ పుట్టుకొచ్చిందని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షరాలు ఎన్.సుబ్రవేణి తెలిపారు. ఇందులో మొత్తం మహిళలే ఉంటారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దశాబ్దాల అవుతున్న రాష్టానికి ఒకరంటే ఒక మహిళా ముఖ్యమంత్రి లేరు. రకరకాల మనుషులు ఉన్న ఇంటిని ఉన్నంతలో సుఖసంతోషాలతో ఉంచుతూ, కాపురాన్ని అనందంగా గడిపేలా చేయడంలో అమ్మపాత్రే కీలకం. అలాంటి అమ్మలు రాజ్యాధికారంలోకి వస్తే ఇక ఆ రాష్ట్రం సస్యశ్యామలమే. ఇంటిలో అమ్మలాలన, పాలన ఎలా ఉంటుందో రాష్ట్ర ప్రజల ముందుకి తీసుకొచ్చేందుకు అమ్మ పార్టీని స్థాపించాం. త్వరలో జరగబోవు ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో పోటీ చేస్తాం. అన్ని చోట్ల మహిళలను రంగంలోకి దింపి, స్త్రీ శక్తిని చాటి. ప్రజలకు సుపరిపాలనను అందిస్తాం. అమ్మ పార్టీ లక్ష్యాలను ఆమె 'ప్రజాశక్తి'కి వివరించారు. ఆమె మాటల్లోనే...

ఉద్యోగులు, వ్యాపారులు ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్నారు. తాత్కాలిక తాయిలాలతో ప్రజలను మభ్యపెట్టడం సరైనది కాదు. మేధావులు రచించిన రాజ్యాంగంలోనే సమానత్వపు హక్కు, వాక్కుస్వాతంత్ర్య హక్కులు ఉన్నాయి. కానీ వీటిని పట్టించుకోకుండా నేటి ప్రభుత్వాలు ఇష్టాను రాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వాలు చేసే ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు పెట్టి, అన్యాయంగా అరెస్టులు చేయిస్తున్నాయి. ప్రతి ఒక్కరికీ ఉచిత విద్య, వైద్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నాయి. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. రాష్ట్ర ఖజానాలో సొమ్ములేదు అంటూనే గొప్పలు చెప్పుకునేందుకు ఏకంగా ప్రభుత్వమే ప్రకటనలకు వందల కోట్ల రూపాయలు గడిచిన మూడేళ్లలో ఖర్చు చేసింది. సలహాదారుల పేరుతో లక్షల రూపాయలు వారికి వేతనాలు, క్యాబినెట్ హెూదా, సెక్యూరిటీ, టిఎ, డిఏలు, అలివెన్సులు అందజేస్తుంది. సామాన్యుడికి మాత్రం ఇతరత్ర పథకాల పేరుతో పదివేలు, పాతికవేలు ఇచ్చి ఇదే అభివృద్ధి అని చేతులు దులుపుకోవడం సరైనది కాదు. రాష్ట్రంలో గడిచిన 8 సంవత్సరాల్లో అధికారంలో ఉన్న పార్టీలు 25 లక్షల కోట్ల రూపాయలు అప్పలు తీసుకొచ్చారు. వాటిని ఏమిచేశారు. రాష్ట్రంలో ఉన్నది 13 జిల్లాలు. జిల్లాకు లక్ష కోట్ల రూపాయలు కేటాయించి ఖర్చు చేసి ఉంటే ప్రతి జిల్లా ఇప్పుడు ఓ మెట్రో నగరంగా ఉండేది. కానీ ఇప్పటికి రోడ్లు లేని పూర్లు, కరెంటు లేని ఇళ్లు, నీళ్ల లేని బోర్లు తప్ప అభివృద్ధి ఏది?. ప్రభుత్వ ఉద్యోగం అంటే జీవితానికి ఓ భరోసా. లైఫ్ సెక్యూరిటీ ఉండేది. కారణం అందులో 30 సంవత్సరాలు పాటు సేవ చేసే రిటైర్డు సమయంలో తాను కూడబెట్టిన సొమ్ము వడ్డీతో సహా వచ్చేది. పైగా తాను ఇన్ని రోజులు చేసిన సేవకు గుర్తింపుగా ప్రతి నెల తన జీతంలో కేటాయించిన సొమ్మును పెన్షన్ రూపంలో నెల నెల ఇస్తూ తన జీవితాంతం, తాను పోతే తన బార్య పిల్లల భృతికోసం వాటిని ఇస్తారనే నమ్మకం. ఇప్పుడు సిపిఎస్ విధానం తీసుకొచ్చి ఉద్యోగం చేసినన్ని రోజులు వేతనం, రిటైర్డు అయితో నీకొచ్చే సొమ్ములో కొంత భాగం మాత్రమే తీసుకోవాలి, మిగిలిన సొమ్మును పెన్షన్‌కు పంపుతాం. నీవు చనిపోతే మరొక్కరికి పెన్షన్ లేదు. ఇలాంటి విడ్డూర పద్దతులను తీసుకురావడం ఉద్యోగుల జీవితాలను విచ్ఛిన్నం చేసేలా ఉంది. దీన్ని ప్రశ్నించే దమ్ము రాష్ట్ర ప్రభుత్వానికి లేదా?. 1857లో బ్రిటీష్ ప్రభుత్వం ఉద్యోగుల సేవను గుర్తించి తీసుకొచ్చిన ఓపిఎస్ విదానాన్ని 1988లో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కూడా ఆమోదించిన సంగతి నేటి పాలకులు మరిచిపోయినట్లున్నారు. నేటి పాలకులు రాజ్యాంగాన్ని విస్మరిస్తూ, ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తూ ప్రజాధనాన్ని దోచేయడమే పనిగా పెట్టుకున్నారు. దాన్ని ప్రశ్నించేందుకు అమ్మ పార్టీ పుట్టుకొచ్చింది.

ప్రజాశక్తి వార్తకు స్పందన

ఆదిఆంధ్రవాడలో సరుకులు పంపిణీ

ప్రజాశక్తి -పాలసముద్రం: 'ఆకలేస్తుంది ఆదుకొండయ్య' అనే శీర్షికన ప్రజాశక్తిలో ఆదివారం వచ్చిన వార్తను స్పందన లభించింది. దీనబందపురం ఆదిఆంధ్రవాడ గ్రామానికి రెవెన్యూ అధికారులు వెళ్లి రెండు నెలలుగా అందని నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామానికి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సరుకులు సక్రమంగా అందలేదని ప్రజాశక్తి విలేకరులతో సమస్యలు విన్నవించామని, మాగోడు పేపర్లో రావడంతో అధికారులు పరిశీలించారని అన్నారు. దీంతో తహశీల్దార్ బాబు, వీఆర్వో సాదు, శ్రీనివాసులు కలసి ఆదివారం అందరికీ సరుకులు అందించారని తెలిపారు. గ్రామస్తులు ప్రజాశక్తికి అభినందనలు తెలిపారు.



ఆదిఆంధ్రవాడలో సరుకులు ఇస్తున్న అధికారులు

ఏపీ ఎఐసీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా విజయ్‌కుమార్

ప్రజాశక్తి- గంగాధరనెల్లూరు: ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా గంగాధరనెల్లూరు గ్రామానికి చెందిన డాక్టర్ విజయ్‌కుమార్‌ను నియమించినట్లు ఆ సంస్థ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బిషప్ శ్యాముల్, రాష్ట్ర అధ్యక్షులు సురేంద్రబాబు తెలిపారు. ఆదివారం జీసస్ విక్టరీ మినిస్ట్రీస్ చిత్తూరు వారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 50మంది దైవసేవకులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించడమే ధ్యేయంగా పోరాడేందుకు ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ సంస్థ పోరాడుతుందని తెలియజేశారు. సమావేశంలో ఏఐసిఎఫ్ ఆంధ్ర రాష్ట్ర లీగల్ చైర్మన్ రాజశేఖర్, ఏఐసిఎఫ్ కష్ణ, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ పోలిమెట్ల డానియల్, ఏపీ స్టేట్ ఉమెన్స్ వింగ్ ఇంచార్జ్ సాలి సుకన్య పాల్, పాస్టర్ పాల్ నెహెమ్యా, దైవజనురాలు ఫిబా జెస్సికా, దైవ సేవకులు కుమార్ పాల్గొన్నారు.



విజయ్ కుమార్‌కు ఆర్గనైజింగ్ సెక్రటరీ నియామకపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

కోలాహలంగా సద్దికూళ్ళపల్లెలో జల్లికట్టు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని సద్దికూళ్ళపల్లె గ్రామంలో కోలాహలంగా ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. ఆదివారం కొమరగుంట పంచాయతీ పరిధిలోని సద్దికూళ్ళపల్లెలో ఉదయాన్నే చుట్టుపక్కల గ్రామాల నుంచి పలువురు యజమానులు వారి వారి ఎద్దులను అలంకరించి వాటి కొమ్ములకు పట్టీలను కట్టారు. జల్లికట్లులో కొంతమంది యువకులు వాటిని పట్టే ప్రయత్నంలో కిందపడి గాయాలయ్యాయి. కొంతమంది పట్టీలను చేజిక్కించుకొని ఆనందించారు.



ఘనంగా మయానసేవ ఉత్సవం

పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

చిత్తూరు నగరంలోని నీవానది వద్ద ఆదివారం అంగరంగ వైభవంగా మయానసేవ ఉత్సవాన్ని నిర్వహించారు. తమిళ సంప్రదాయం ప్రకారం దక్షప్రజాపతి తాను తలపెట్టిన హోమానికి తన కూతురు పార్వతి పిలిచి, శివున్ని అవమాన పరచడంతో పార్వతిదేవి ఆగ్రహించి కాళికామాతగా మారి ఉగ్రరూపంతో తన తండ్రిని చంపిన ఘటనను మయానసేవగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా బెస్తకులస్తులు నగరంలోని అంకాల పరమేశ్వరి ఆలయం నుండి నీవానది వరకు ఊరేగింపుగా వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన 55 అడుగుల దక్షప్రజాపతి మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా అంకాల పరమేశ్వరి ఆలయ అభివద్ధి ట్రస్ట్ ప్రతినిధి కేఎం.కుమార్, గిరింపేట గురప్పస్వామి సమేత సంకాల పరమేశ్వరి ఆలయ ధర్మకర్తలు చిరంజీవి హేమంతు రాజశేఖర్‌లు మాట్లాడుతూ దక్ష ప్రజాపతి మరణం అనంతరం 55 అడుగుల మట్టి విగ్రహాన్ని భక్తులు ప్రసాదంగా స్వీకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సుమారు 50 వేల మంది పైగా భక్తజనం పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు ఆదేశాల మేరకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటి సమస్యలున్న 74 మందికి చికిత్స చేయగా వారిలో 14 మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం గుర్తించారు. వీరికి కుప్పం పిఇఎస్ హాస్పిటల్‌లో ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో రాను, పోను ఉచిత బస్సుసౌకర్యం కల్పించి కంటివైద్య నిర్వహించి వారి ఇంటి వద్దకు చేర్చేంత వరకు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఫౌండేషన్ సంస్థ సహాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ :తెలంగాణలోని హైదరాబాద్ నగరం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం నందు సీఎంకోహినూర్ రిథమిక్ జిమ్నాస్టిక్ ఛాంపియన్షిప్ 2023 మెన్స్, విమెన్ కాంపిటీషన్స్ జిమ్నాస్టిక్ తెలంగాణ అసోసియేషన్, కే స్పోర్ట్స్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 17 నుంచి 19 వరకు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఆంజనేయ గౌడ్, తెలంగాణ స్టేట్ చైర్మన్ వేణుగోపాల ఆచారి, చైర్మన్ తెలంగాణ ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఉప్పల్ శ్రీనివాస్, తెలంగాణ టూరిజం చైర్మన్ ఎలమంచిలి ప్రవీణ్ జిమ్నాస్టిక్ అసోసియేషన్ పాట్రన్ గెలుపొందిన క్రీడాకారులకు బహుమతి ప్రదానం చేశారు.

నికర జలాల దోపిడీని' అడ్డుకుంటాం : నవీన్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్ : ఈనెల 25-28 తేదీల్లో రాజోలిబండ నుంచి రిక్రియేషన్ క్లబ్ గ్రౌండ్ ఆదోని వరకు 'నికర జలాల పరిరక్షణ' మహాపాదయాత్ర జరగనుందని, దీన్ని విజయవంతం చేయాలని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి సభ, ప్రదర్శన పోస్టర్‌ను విడుదల చేశారు. రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో కలిసి వచ్చే ప్రజాసంఘాల, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో రాయలసీమ స్టీరింగ్ కమిటి చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో తుంగభద్రపై ఆధారపడి కొనసాగుతున్న హెచ్ఎల్‌సి, ఎల్ఎల్‌సి, ఆర్‌డిఎస్, కెసి కాల్వల నికర జలాల పరిరక్షణ కోసం ఈ మహాప్రదర్శన జరుగుతుందని తెలిపారు.

తెలుగు భాషా రక్షణ ఇంటి నుంచే మొదలవ్వాలి



సదస్సులో రచయితలను సత్కరిస్తున్న తులసీనాథం నాయుడు

ప్రజాశక్తి- పలమనేరు: తెలుగు భాషా పరిరక్షణ అనేది ఇంటినుంచే మొదలవ్వాలని తెలుగు సాహిత్య సాంస్కతిక సమితి అధ్యక్షులు పి.తులసినాథం నాయుడు అన్నారు. ఆదివారం తెలుగు సాహిత్య సాంస్కతిక సమితి కళామందిరంలో 'తెలుగు భాషా రక్షణకు మీరేం చేయగలరు' అనే అంశం మీద వందమంది రచయితలతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికి వారు తమ బాధ్యతగా భాషా రక్షణకు నడుం బిగించాలన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశ్రాంత ఆచార్యులు వల్లేరు హరినాయుడు మాట్లాడుతూ... మాతభాషలో ప్రావీణ్యం లేకుండా ఇతర భాషలు నేర్చుకోవడం కష్టతరమని అన్నారు. మాతభాష కళ్ళవంటిది అయితే ఇతర భాషలు కళ్ళద్దాల లాంటివన్నారు. ప్రముఖ రచయితలు మాధవరెడ్డి, జొన్నవిత్తుల శ్రీరామచంద్ర మూర్తి మాట్లాడుతూ... మాతభాషాభిమానంలో తమిళులను, కన్నడిగులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎఎస్.ఫౌండేషన్ తిరుపతి, మదర్‌థెరిసా విద్యాసంస్థలు పలమనేరు వారి సహకారంతో పాల్గొన్న రచయితలందరినీ శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో శివశంకర్‌రెడ్డి, సంస్థ కార్యదర్శి పుష్ప, శ్రీపురం శీతారామయ్య, అవిలాల శ్రీధర్, శ్యామలాదేవి, గురుమూర్తి, రమేష్‌నాయుడు, నీలిమ, గిరిధరమూర్తి, నరేంద్ర పాల్గొన్నారు.

'కాంగ్రెస్'కి పూర్వవైభవం తీసుకొస్తాం

రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు రుద్రరాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రుద్రరాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు రాష్ట్రంలోని అన్నిజిల్లాల్లో ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రుద్రరాజు తెలిపారు. ఆదివారం స్థానిక ఎల్‌జిబి టవర్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన చోడో యాత్రకు ప్రజల నుండి మంచి స్పందన లభించిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీని బలోపేతం చేసేందుకు 80శాతం జిల్లాల సమావేశాలు పూర్తి చేశామన్నారు. రాష్ట్రంలో జగన్‌ప్రభుత్వ అరాచక పాలన సాగుతోందని అరాచక పాలనకు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నట్లు తెలిపారు. వాపక్ష పార్టీలను కలుపుకొని జీవో నెంబర్ ఒకటికి వ్యతిరేకంగా ఉద్యమం చేశామని, రాబోయే రోజుల్లో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు తీవ్రతరం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈసమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సురేష్‌రెడ్డి, నగర అధ్యక్షులు టిక్కీ రాయల్, నాయకులు బుల్లెట్ రవి, మహిళా నాయకురాలు ధనలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

తారకరత్న మృతికి అశ్రునివాళి

ప్రజాశక్తి- పలమనేరు:

సినీ నటుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు నందమూరి తారక రత్న మతికి తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా నివాళులు అర్పించారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తారక రత్న చిత్రపటానికి పూలమాల వేసి సంతాపాన్ని తెలియజేశారు. తారకరత్న మతి పార్టీకి, తెలుగు సినిమా పరిశ్రమకు తీరని లోటని అన్నారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆర్‌బిసి కుట్టి, గిరిబాబు, సుబ్రహ్మణ్యం గౌడు, నాగరాజు, సోమశేఖర్ గౌడ్, సుబ్బ నాగయ్య, సుబ్రహ్మణ్యం, రామ్మూర్తి, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: సినీ నటుడు నందమూరి తారకరత్న మతికి మండలంలోని టిడిపి పార్టీ కార్యాలయంలో గిరిబాబు, జనార్ధన్ గౌడ్, హరి, బాషా, గిరి నివాళి అర్పించారు.

రొంపిచెర్ల: మండలంలో నందమూరి తారకరత్న చిత్రపటానికి నందమూరి ఫ్యాన్స్ అధ్యక్షులు వెంకటముని ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. శ్రీను, సివి రమణ, సద్దాం, బాలకష్ణ, మునీంద్ర, చందు, సునీల్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

వికోట: ప్రముఖ సినీనటుడు తెలుగుదేశం పార్టీ క్రియాశీలక నేత నందమూరి తారకరత్న (39) మరణానికి వికోట మండల టిడిపి నేతలు కార్యకర్తలు అశ్రు నివాళులర్పించారు. స్థానిక ఎన్టీఆర్ కూడలిలో తారకరత్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల అధ్యక్షులు రంగనాథ్, రామచంద్ర నాయుడు, ఈశ్వర్ గౌడ్, ధీరజ్, శబరీష్, సర్పంచ్ విశ్వనాథ్, రాము, నారాయణ పాల్గొన్నారు.



తారక రత్నకు నివాళి అర్పిస్తున్న టిడిపి నాయకులు

కుంభాభిషేకం పూజలో పాల్గొన్న డిప్యూటి సిఎం

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: మహదేవ మంగళ గ్రామంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయ మహా కుంభాభిషేకం పూజలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలో హోమం పూజలు, ఉద్వాసన, సంప్రోక్షణ, జీర్ణోద్ధరణ, కల్యాణోత్సవం మహా కుంభాభిషేకం పూజలను పురోహితులు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ విశేషంగా చేశారు. ఈ పూజలకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి విచ్చేయగా ఆలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని పూజలో పాల్గొన్నారు. ఉమామహేశ్వర స్వామిని పల్లకిలో ప్రదర్శించి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.



పూజల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

బీమా చెక్కును అందజేసిన పసుపులేటి

ప్రజాశక్తి- నగరి:

నగిరి నియోజకవర్గం పాదిరి గ్రామంలో మణికంఠ అనే జనసేన క్రియాశీలక కార్యకర్త ఆకస్మికంగా మరణించడంతో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు 5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయాన్ని జనసేన పార్టీ పిఏసీ సభ్యులు, చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ద్వారా ఆ కుటుంబ సభ్యులకు అందించారు. మణికంఠ పిల్లలకు, కుటుంబ సభ్యులకు ఆరోగ్యరీత్యా ఎలాంటి అవసరాలు ఉన్నా మేము ఉన్నామని తెలిపారు. వారి పిల్లల విద్యకు అయ్యే ఖర్చు మేము సహాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మధుబాబు, జిల్లా అధికార ప్రతినిధి మెరుపుల మహేష్, జిల్లా కమిటీ సభ్యులు పి.ఆనంద్ , స్వామినాథన్, జిడి నెల్లూరు ఇంఛార్జి యుగంధర్, పీలేరు నియోజకవర్గం దినేష్, జిల్లా గౌరవ అధ్యక్షులు కష్ణయ్య , సామాజిక వేత్త కరుణానిధి , నింద్ర మండల అధ్యక్షుడు శివలింగం , జగదీష్ రాజు, దేవ, జనసేన పార్టీ వీర మహిళ రాధమ్మ, మండల కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బీమా చెక్కును అందిస్తున్న పసుపులేటి హరిప్రసాద్

కొత్తపల్లిలో కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి- గంగవరం: మండలం కొత్తపల్లి పంచాయతీలు మహాశివరాత్రి పండుగ సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించినట్లు సర్పంచ్ గిరిరాజారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి పండుగ రోజు జాగరణ సందర్భంగా గ్రామస్తులు మేల్కొని క్రీడలు తిలకిస్తారని, యువకులు ఉత్సాహంగా ఆటల్లో పాల్గొంటారే ఉద్యేశంతో ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పోటీల్లో మొదటి బహుమతి రూ.25,116లు కర్ణాటక కోలార్ చెందిన బజరంగబలి టీం గెలుచుకుంది. అలాగే రెండో బహుమతి రూ.15,116లు, మూడో బహుమతి రూ.10,116లు పర్ణంబట్ వారు గెలుచుకున్నారని తెలిపారు. నాలుగో బహుమతి సిఎన్పిఎస్, ఐదో బహుమతి కొత్తపల్లి గ్రామానికి చెందిన కోనేటిరాయ టీం, ఆరో బహుమతి నరసింహబ్రదర్స్ పేర్నంబర్ వారు గెలుచుకున్నారన్నారు. విజేతలకు బహుమతులు అందజేసినట్లు తెలిపారు.



గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ గిరి రాజారెడ్డి

రావణబ్రహ్మ వాహనంపై ముక్కంటి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని స్వయంభుగా వెలసిన శ్రీకామాక్షి సమేత మొగిలిశ్వరస్వామికి మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు ఆదివారం ఉదయం రావణబ్రహ్మ వాహనంపై బోలాశంకరుడు దర్శనం గావించారు. మొదట స్వయంభు మొగిలేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఉత్సవ విగ్రహాలు సుందరంగా అలంకరించి వాహనాలు పైనుంచి గ్రామపురవీధుల్లో ఊరేగారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవాలను దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి శేషవాహనంపై శివపార్వతులు భక్తులకు దర్శనం గావించారు. ఆలయ వంశపార ధర్మకర్త విజయ్ కుమార్, కార్యనిర్వహణ అధికారి మునిరాజులు, భక్తులు పాల్గొన్నారు.

శివుడిని దర్శించుకున్న జబర్దస్త్ యాంకర్ సుధాకర్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం : మండలంలోని మొగిలి గ్రామంలో స్వయంభుగా వెలసిన శ్రీకామాక్షి సమేత మొగిలిశ్వర స్వామిని జబర్దస్త్ కామెడీ నటుడు సుధాకర్ ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ వెలుపల గ్రామస్తులు ఆయనతో సెల్ఫీలు తీసుకున్నారు. అలాగే రావణబ్రహ్మ వాహనంపై ఊరేగుతున్న బోలా శంకరుని దర్శించుకున్నారు.

బైరెడ్డిపల్లి : మండలంలోని తీర్థం గ్రామ సమీపాన ఉన్న శ్రీ కాలభైరవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండల సచివాలయ కన్వీనర్ కార్తికేయన్, మాజీ ఎంపీపీ అమరావతి పూజలో పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సిఐటియు అనుబంధ సంఘాలైన అంగన్‌వాడి, యుటిఎఫ్, ఎస్‌టియు, ఆటో యూనియన్ బిల్డింగ్ వర్కర్స్, ఎల్ఐసి, పోస్టల్, బిఎస్ఎన్ఎల్ ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు, ఉద్యోగ కార్మిక సంఘాలు, అసంఘటిత కార్మిక సంఘాల సమస్యలపై శాసనమండలిలో నిలదీస్తున్నటువంటి పిడిఎఫ్ అభ్యర్థులు మీగడ వెంకటేశ్వర్ రెడ్డి, పోకిరెడ్డి బాబు రెడ్డి లను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 22వ తేదీన చిత్తూరు జిల్లా కలెక్టరేట్ ఆఫీస్‌లో జరగనున్న నామినేషన్లకు ఉపాధ్యాయులు, కార్మిక సంఘాలు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. వారి సమస్యల పరిష్కరణకై కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పాతపెన్షన్ విధానం పునరుద్ధరించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎ విజయ్. కె ఆర్ సుబ్రహ్మణ్యం, పి భాస్కర్, యాసిన్ భాష తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-కోట: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... కోట మండలం సిద్ధవరం పంచాయతీ పరిధిలోని ఇళ్లకూరు పాడు గ్రామంలో నివాసం ఉంటున్న మానికల కస్తూరమ్మ పూరిల్లులో శనివారం రాత్రి 7 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో మంటలు చెలరేగి పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. మంటలు వ్యాపిస్తున్న సమయంలో ఇంట్లోని మానికల కస్తూరమ్మ, ఆమె కుమార్తె వెంటనే బయటకు పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న బట్టలు, వంట సామాగ్రి కాలి బూడిదయ్యాయి. గిరిజన కుటుంబానికి చెందిన మాలికల కస్తూరమ్మకు ఒక కుమార్తె ఉంది. పూట గడవడమే కష్టంగా జీవిస్తుంది. ఇప్పుడిప్పుడే మూడు పూటలా అన్నం తినగలుగుతున్న సమయంలో విధి వీరిని నిరాశ్రయులను చేసింది. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన మాణికల కస్తూరమ్మ దాతల సహాయ సహకారాలు కోరుతున్నారు.

గిరిజనులకు చెత్త బుట్టల పంపిణీ

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: లోకా ఫౌండేషన్ (వన్ హ్యూమానిటీ కేర్) ఆధ్వర్యంలో కాంబాకం గిరిజన కాలనీ (కష్ణాపురం) లోని 100 కుటుంబాలకు వరల్డ్ మోడల్ విలేజ్ డెవలప్‌మెంట్‌లో భాగంగా చెత్త బుట్టలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సదర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం గురించి అవగాహన కల్పించారు. మన ఇంటిని, ఇంటి ఆవరణాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని, తడి చెత్త, పొడి చెత్తను వేరుగా చేసి పంపిణీ చేసిన చెత్త బుట్టలను ఉపయోగించి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు సహక రించాలని కోరారు. ఎప్పుడైతే మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామో అప్పుడే మన ఆరోగ్యం బాగుంటుం దన్నారు. లోకా ఫౌండేషన్ (వన్ హ్యూమానిటీ కేర్) జనరల్ మేనేజర్ సునీల్ జి మాట్లాడుతూ ఇంటి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడు గ్రామం కూడా అందంగా ఉంటుం దని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు భువనేశ్వర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

గణిత మేధో పరీక్షల్లో పుత్తూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: గణిత మేధో పరీక్షల్లో పుత్తూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. వివరాలు... ఎక్స్ ట్రా జీనియస్ అకాడమీ దేశ వ్యాప్తంగా 6-12 ఏళ్ల మధ్య చిన్నారులకు టాలెంట్ హంట్-2023 ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. అందులో పుత్తూరులోని గిరిజనగర్ కాలనీలోని వైహెచ్‌కె అబాకస్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ పొందారు. కేవలం 10 నిమిషాల వ్యవధిలోనే 100 ప్రశ్నలు పూరించారు. మొత్తం 22 మందిలో 7 మంది 100 శాతం స్కోరు సాధించగా మిగతా వారు 90-99 శాతం స్కోరు సాధించారు. విజేతలకు ఆదివారం పుత్తూరు మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్, విద్యావేత్త జయప్రకాష్ (చిట్టి) మెమెంటోలు, ప్రశంసా పత్రాలు బహుకరించారు. పిల్లల్లో ఉన్న మేధో సంపత్తిని పెంచడానికి ఇలాంటి శిక్షణ, పోటీ పరీక్షలు ఎంతో దోహదపడుతాయని ఆయన తెలిపారు. అలాగే వారిలో సజనాత్మక శక్తి పెరిగి ఉన్నత పౌరులుగా రాణించడానికి బంగారు బాటలు వేస్తాయని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు తన వంతు సాయం ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రసన్న, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. మెమెంటోలు అందుకున్న వారిలో చాతుర్య, యోహిత, శ్యామ్, ప్రసాద్, జటిన్, నేస్విక, బి.కార్తిక్, లహరి, బలసుదన్, సాత్విక్, మోక్షిత, వర్షిత, హంప్రకష్, యం.కార్తిక్, ఐశ్వర్య, అలేఖ్య, ప్రియ, ఆశిష్ జశ్విత్, కీర్తన, గురుదేవ్, హరి ప్రియ ఉన్నారు.

తాతయ్యగుంట గంగమ్మ సేవలో హోం మంత్రి

ప్రజాశక్తి-తిరుపతి: తిరుమల దర్శనార్థం తిరుపతికి విచ్చేసిన హోం మినిష్టర్ తానేటి వనిత ముందుగా తాతయ్యగుంట గంగమ్మను ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. తారకరత్న చిన్న వయసులో గుండెపోటుతో చనిపోవడం చాలా బాధాకరమైన విషయమన్నారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తున్నట్టు తెలిపారు.

దేశాభివృద్ధిలో అధ్యాపకుల పాత్ర కీలకం

ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డి

ప్రజాశక్తి-క్యాంపస్: ఏ దేశాభివృద్ధిలో అయినా క్షేత్రస్థాయి నుంచి అధ్యాపకుల పాత్ర కీలకమని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యా లయం ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డి పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని సెనేట్ హాల్లో అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్సిక్ మహా రాష్ట్ర ప్రథమ మహాసభలు ఆదివారం రాష్ట్ర కన్వీనర్ ఆచార్య వైవి రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యుజిసి సభ్యులు ఆచార్య శివరాజ్, ఎస్వియు ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి ఆచార్య నారాయణలాల్ గుప్తా, సంఘటన కార్యదర్శి గుంత లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలలు, ఇంజనీరింగ్, అగ్రికల్చర్, వెటర్నరీ, ఐఐటి, ఐజర్ వంటి ఉన్నత విద్యా సంస్థల్లో పని చేస్తున్న అధ్యాపకుల బోధన, పరిశోధన సామర్థ్యాల ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యా లను పెంపొందించడం ద్వారా జాతీయ అభివద్ధిలో ఎంతో కీలక పాత్ర వహిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన జాతీయ విద్యా విధానం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మార్గదర్శకంగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో అమలు చేస్తున్నామని ఆచార్య కె.రాజారెడ్డి వెల్లడించారు. యుజిసి సభ్యులు ఆచార్య శివరాజ్ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం భారతదేశంలోని పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను, ఉపాధిని అందించేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రధాన వక్త గుంత లక్ష్మణ్ మాట్లాడుతూ భారతదేశంలో గురువుకు విశిష్టమైన స్థానం ఉందని ఆదికాలం నుంచి కూడా సమాజంలో విద్యా ర్థులను దేశభక్తులుగా, మంచి నడవడిక, ఉన్నత విలువలు కలిగిన పౌరులుగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. దురదష్టవశాత్తు ప్రస్తుతం భారతదేశంలో విదేశీ ఆచారాలు, సాంప్రదాయాలు తీసుకువచ్చే క్రమంలో సంస్కతి, సాంప్రదాయాలకు భంగం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆచార్య నారాయణ లాల్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచంలో భారత్ దేశ కీర్తి ప్రతిష్టలు పెరగడం, అభివద్ధి చెందిన దేశాలతో అభివద్ధిలో పోటీపడుతూ, అప్రతిహతంగా జాతీయ అభివద్ధిలో ముందుకు సాగుతుందన్నారు. అంతర్జా తీయ సంస్థలకు భారతీయులు నాయకత్వం వహించడానికి అవసరమైన నైపుణ్యం కలిగిన విద్యార్థులను తయారు చేయడంలో గురువు పాత్ర కీలకమన్నారు. భారతదేశ జి20 దేశాలకు నాయకత్వం వహించడం, ఆ సభలను సమర్థ వంతంగా నిర్వహించడం దేశానికి ఎంతో గర్వకారణ మన్నారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి-పిచ్చాటూరు: రానున్న వేసవి దష్ట్యా సత్యవేడు నియోజవర్గంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని నారాయణవనం జెడ్పీటీసి ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్ అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జెడ్పిలోని సమావేశ మందిరంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. సభ ప్రారంభం కాగానే తొలుతగా చిత్తూరు జిల్లా మాజీ మంత్రివర్యులు గుమ్మడి కుతూహలమ్మ మతికి జెడ్పి చైర్మన్ రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. సాధారణ సర్వసభ్య సమావేశం అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గంలోని నారాయణ వనం, పిచ్చాటూరు, కెవిబి పురం, నాగలాపురం, బుచ్చి నాయుడు కండ్రిగ, వరదయ్యపాలెం, సత్యవేడు మండలాల్లో రానున్న వేసవిలో ప్రజలకు త్రాగునీటికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సత్యవేడు నియోజకవర్గంలోని మండల స్థాయి అధికారులు గ్రామాల పరిస్థితులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఎక్కడా సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు.